# బొమ్మలాట

కొలకలూరి



కృష్ణమూర్తి: వయస్సు నలభై అయిదు.
పెద్దతనం – భయం!
చిన్నతనం – ఆశ!!
వార్ధక్యం ఊహించుకొంటే దిగులు!
యౌవనం పోగొట్టుకోకూడదని తాపత్రయం!
కాలం గడుస్తుంటే
ఆశ తీరటంలేదు
నిరాశ పెరుగుతూ వుంది
తెల్ల వెంట్రుకలు!!
తలలో!
నల్ల రంగు!
మీసాలలో!!
నల్ల రంగు!!
గడ్డంలో!!
రోజూ షేవింగ్!!!
తల నున్నగా దువ్వి
మీసం నల్లగా చేసి,
గడ్డం మొటిక లేకుండా,
టిప్ టాప్‌గా
యువకుళ్ళా తయారవుతున్నాడు కృష్ణమూర్తి!
వైట్ పేంట్,
డిటో శ్లాక్,
పాయింటెడ్ షూ,
వాటర్ పాలిష్,
క్రూకట్!
సైట్ ఉన్న బస్‌కి కూలింగ్ గ్లాసెస్.
అచ్చంగా
యువకుళ్లా–అయిపోతున్నాడు కృష్ణమూర్తి!

కృష్ణమూర్తి: లెక్చరరు! తోటి వాళ్ళలో ఎవరితోనూ, డిపార్టుమెంటులో ఎంతో అవసరం అయితేతప్ప మాట్లాడ్డం లేదు.

వాళ్ళు ముసలివాళ్ళు!
మాటలలో వార్ధక్యం!
చేతల్లో వార్ధక్యం!!
సహించలేడు.
అందుకే మాట్లాడ్డంలేదు.

మాట్లాడుతాడు!
యువకులతో!
డిపార్టుమెంటులో, కాలేజీలో క్రొత్తగా చేరిన లెక్చరర్సుతో, ట్యూటర్సుతో, డిమాన్‌స్ట్రేటర్సుతో, విద్యార్థులతో, విద్యార్థినులతో.
బాగా మాట్లాడుతాడు.
ప్రిన్సిపాల్‌తో
నో!
హెడ్‌తో
నో!
అమ్మతో
నో!
నాన్నతో
నో!
ఒక్కటేమాట!
వృద్ధతరంతో మాట్లాడు! — నో!!
యువతతో మాట్లాడుతాడు! — యస్!!
అంతేకాదు.
వృద్ధుల్ని సలహా అడగడు.
వెంటతిరగడు.
పట్టించుకోడు.
వృద్ధతరం బ్రతికివుందని భావించడు!
యువకులతో,
షికార్లకు పోతాడు.
కాళ్ళనొప్పి!
వాళ్ళుబాగా తిరుగుతారు.
ఎగురుతారు!
దూకుతారు!
తను చేయలేడు!
అయినా ప్రయత్నిస్తాడు.
హోటలులో
వాళ్ళు బాగాతింటారు.
తాగుతారు.
తినేస్తారు.
తొక్కేస్తారు.
లోపలికి కుక్కేస్తారు.
తను తినలేడు
కాదనలేడు!
ఓపికమాపుతాడు.
వారంరోజులు ఓపికగా జీర్ణంచేసుకొంటాడు.
కబుర్లలో
వాళ్ళ ఆడపిల్లల్ని గురించి,
ప్రేమల గురించి,
వివాహాల గురించి,
కట్న కానుకల గురించి,
ఆదర్శ ప్రేమలగురించి,
ఊహాలోకాల ఊహ ప్రేయసీ మణుల శృంగార జీవితం గురించి.
లోకంలోని అనేక విషయాల గురించి,
సుందర స్వప్నాలు కంటుంటే,
ఆదమరచిపోయి,
వాళ్ళతో చేయి చేయి కలిపి,
కొంత ఊహ!
కొంత వాస్తవం!
నేర్పుగా మేళవించి,
యువకుడే అనిపించుకొన్నాడు కృష్ణమూర్తి!
ఒకప్పుడు
కృష్ణమూర్తి ముసలివాడు!
ఇంకొప్పుడు
యువకుణ్ణా ఉండాలను కొంటున్న వాడు!
మరొప్పుడు
యువకుణ్ణను కొంటున్నాడు
వేరొప్పుడు
యువకుణ్ణా వున్నాడు.
ఇప్పుడు
యువకుడే అయినాడు.
కృష్ణమూర్తి యువకుడు. అచ్చంగా యువకుడు! స్వచ్ఛంగా యువకుడు!!
ఒక యువకుడడిగాడు.
"మీకు పెళ్ళయిందా?"
కృష్ణమూర్తి నవ్వాడు!
"మా బంధువులమ్మాయి — అందంగా వుంటుంది. చూడకూడదూ!"
కృష్ణమూర్తి పరవశించిపోయాడు.
"మి పెళ్ళికి మమ్మల్ని పిలవరా?"
కృష్ణమూర్తి మెలికలు తిరిగిపోయాడు.
అవునుమరి,
అచ్చంగా యువకుడు కృష్ణమూర్తి!
ఈ రోజే!
సినిమాకుపోదాం సిద్ధంగా ఉండని శ్రీమతికి ఉదయం చెప్పివచ్చాడు కృష్ణమూర్తి.
సాయంత్రం ఇంటికి వెళ్ళేసరికి,
కాఫీ హోటల్‌కి, కనకయ్య పార్కుకి కాకుంటే క్లబ్బుకి, కనిపించే సినిమాకి, భర్తవెంట పోవటానికి,
సిద్ధంగావుంది
నలుగురు పిల్లల తల్లి!
నలభై రెండేళ్ళ శ్రీమతి!!
మధ్యాహ్నం రాజమండ్రినుంచి పెద్దకూతురు, ఇద్దరు కూతుళ్ళతో దిగింది.
పెద్దదానికి నాలుగేళ్ళు!
చిన్నదానికి ఏణ్ణర్థం!
"బాగున్నావా?" తండ్రి!
"ఆఁ!" కూతురు.
"బైల్దేరూ పోదాం!" భార్యతో
"బట్టలు మార్చుకోరా!" తండ్రితో
"ఊహుఁ!" కూతురుతో
"అయనిష్టం!" కూతురుతో.
వసారాలో, ఆ ప్రక్క, పెద్దది, నాలుగేళ్ళది, బొమ్మను తీసుకొని—
కృష్ణమూర్తి: చూస్తున్నాడు. చేతుల్లో వూపుతూ, లాలిపాడి; ఎదురొమ్ము కానించుకొని జోకొడుతూ "ఏడవకమ్మా తాగు!" అంటూ—
కృష్ణమూర్తి: చూస్తున్నాడు. "తాగమ్మా! తాగు!" పాప, బొమ్మ పాపకు పాలిస్తూ వుంది.
బొమ్మ — పాప — చూస్తున్నాడు.
పనితల్లి, దగ్గరకు. కృష్ణమూర్తి, వృద్ధ-యువకుడు-వెళ్ళాడు.
కళ్ళు గమ్మత్తుగామూసి, బొమ్మ పాపకు పాలిస్తూ వుంది పాప. ●

